# ఓరి అనుభవం బాబు!

మరీ నెలరోజుల్నుంచీ జానకికి సూర్యం పెద్దసమస్యే కూచున్నాడు.

నాలుగు నెలల క్రిందట సత్యం అనే వ్యక్తి ఎవరో, ఎక్కడివాడో, ఎలాంటివాడో కూడా తనకి తెలీదు. అప్పుడు దసరాలో గాఁవల్ను, మైసూరు మామయ్య సపరివారంగా యిక్కడికి వచ్చినప్పుడు, యీ వూళ్ళో తనకు తెలిసిన ఓ కుర్రాణ్ణి కలుసుకోవాలన్నాడు. అప్పట్లో ఆ సంగతి తనేం పట్టించుకోలేదు.

ఆ మర్నాడే మామయ్య టౌన్‌లోకి వెళ్ళి కొందరు అబ్బాయిల్ని వెంటబెట్టుకొచ్చి 'ఆయన'కు పరిచయం చేస్తున్నాడు. వంటింట్లో అత్తయ్య వంట చేస్తున్నది. తను గడపదగ్గర కూచుని, అప్పుడే 'ఆయన' బజార్నుంచి పట్టుకొచ్చిన కాఫీపొడి పొట్లం విప్పి డబ్బాలో పోస్తున్నది, తల పైకెత్తకుండా.

"ఇతడు సూర్యం—" అని మామయ్య కంచుకంఠం వినబడగానే గబుక్కున తలెత్తి చూసింది. తన ఆతృతకు తనే ఆశ్చర్యపడ్డది. మరి ఆ పేరులో ఏమంత ఆకర్షణ లేదే...'

కాని పేరులో ఆకర్షణలేని లోటు మనిషిలో తీరినట్టుగా అనిపించింది తనకు, ఆ కొత్త వ్యక్తిని చూడగానే. అతగాడిలో అన్నిటికన్నా మిన్నగా తనని ఆకర్షించింది - ఎత్తుగా, ఎర్రగా నీడలు తేలుతున్న ఆ అబ్బాయి బుగ్గలూ, సాఫీగా వుండి దువ్వేనకు లొంగీ లొంగని క్రాపింగూ!

"ఇతడు సూర్యం. ఇక్కడే యం.బి.బి.యస్. చదువుతున్నాడు. ఇంకో సంవత్సరంలో 'నేనూ ఒక డాక్టరు'నంటూ జెండా ఎగరేయబోతున్నాడు" అన్నాడు మామయ్య.

మామయ్యమాటల్లో ఏమంత హాస్యం లేదు. కాని కొత్తగా పరిచయం అయిన 'ఆయన' ముందు మామయ్య విసిరిన ఛలోక్తికి కొంచెమయినా 'రెస్పాన్సు' చూపకపోతే బాగుండదనిపించిందేమో ఆ అబ్బాయికి— చిన్నగా నవ్వాడు, ఎత్తైనబుగ్గలు మరింత ఉబ్బిపోయేటట్టుగా.

అలానవ్వి, 'ఆయన'కు నమస్కారం చేశాడు. 'ఆయన' ప్రతి నమస్కారం చేశాడు.

---

పణతుల రామచంద్రయ్య

పరోక్షంలో అతిసామాన్యమయిన అభిప్రాయాన్ని కలిగించే వ్యక్తులు కొందరు ప్రత్యక్షంగా వున్నప్పుడు మనస్సునిండా ఆదరించు కొంటూచుంటారు. అందుకు కారణాలను గీచిచూపటం కష్టం ... సూర్యం అలాంటివాడేనేమో అనిపించింది తనకి.

అప్పుడు — మామయ్య అంతటితో వూరుకోవచ్చునా ? అబ్బే ! వూరుకుంటే ఆయన మైసూరు మామయ్య ఎందుకవుతాడు ? అతణ్ని 'ఆయన'కు పరిచయం చేసే ఘట్టం పూర్తయ్యాక తనవేపుతిరిగి, "ఏవమ్మా జానకీ, వీణ్ని నీ వెరుగుదువా ? మనవాడేలే, నీకుగుర్తుండదేమో గాని ! ఎలాగుర్తుంటుంది మరీ ? అడిగే వాళ్ళులేరని అవ్వాయి చువ్వాయి లాగా పెరిగిపోయాడువీడు ..." అన్నాడు. ఆ తర్వాత అతడితో, "ఏవిరా, ఈ అమ్మాయి గుర్తుందా నీకు?" అన్నాడు.

"లేదండీ." అన్నాడతడు, మర్యాదకు నవ్వుతూ. ఇహ అక్కణ్నుంచీ ప్రవహించింది మామయ్య ఉపన్యాసధోరణి. తమను గురించి ఆ అబ్బాయికీ, ఆ అబ్బాయిని గురించి తమకీ అటూయిటూ మూడు తరాలదాకా వరసలు ఏకరువుపెడుతూ ప్రవరచెప్పుకు పోయాడు.

చెబుతున్నంతసేపూ తనూ అక్కడే కదలకుండా కూచుని వున్నదేకాని, ఆ మాటల్లో ఒక్కముక్కా తనకు బుర్రలో కెక్కలేదు. తనధ్యాసా, తన ఆలోచనలూ మరోవేపూ...ఆ ఆలోచనలన్నీ అర్థం లేనివని అప్పుడు తోసేయగలిగిందిగాని, ఇప్పుడది సుతరామూ సాధ్యం కావటం లేదు.

అతడుమాత్రం మామయ్య చెబుతున్న దానికి వూఁకొడుతున్నాడు, వాలుకుర్చీలో జేరగిలబడి. అయితే అతడి కళ్ళల్లో నిర్లక్ష్యం, మొహంలో 'ఇదంతా వినవలసిన ఖర్మ నాకే పట్టిందా ?' అన్న విసుగూ కనిపించాయి తనకి.

ఆ నిర్లక్ష్యమే, ఆ విసుగే తనకు నచ్చలేదు. అసలు సూర్యం తనకు ఏ ఒక్క విషయంలోనైనా నచ్చటం తన కిష్టంలేదు...

ఇదంతా, కొత్తగా తమకు పరిచయమైన సూర్యంపట్ల విముఖత సృష్టించుకోవలసి జానకిచేసిన ప్రయత్నం. ఎందుకో ఆవిడకీ తెలీదు. అందుకే, అది సఫలం కానూలేదు. ఏదో ఒకచిన్న కారణం, అదెంత అల్పమైన దయినాసరే, పునాదిగా వుంటేతప్ప, ఒక వ్యక్తి మీద వాత్సల్యంకాని ద్వేషంగాని కల్పించుకోవటం సాధ్యంకాదని జానకికి అప్పుడు కాని తెలిసిరాలేదు.

"ఎందుకో మనిషికంత నిర్లక్ష్యం ? డాక్టరీ చదువుతున్నాడని గాఁవల్ను !" అనుకుంది. ఒకవేళ పెద్ద చదువులు చదివితే మాత్రం, అంతగర్వపడాల్సిన అగత్యమేముందీ ?

మైసూరు మామయ్య మాత్రం ఇలాంటి ఆలోచనలకూ, అభిప్రాయాలకూ వేటికీ అంత ప్రాముఖ్యత నిచ్చే పరిస్థితిలోలేడు. మామయ్య మాట్లాటం మొదలు పెడితే ఆపటం అతడికే కష్టసాధ్యమైనపని. ఆయన వ్యక్తులనుంచీ కుటుంబాలకూ, కుటుంబాలనుంచీ వంశాలూ గోత్రాలదాకా ఉపన్యాస విహారం చేసి, పరిచయంచేసే కార్యక్రమం నిర్వర్తించినవాడై మళ్ళీ మొదటి కొచ్చాడు.

"అమ్మాయ్ ! అసలేమయిందను కున్నావ్ ? ఇందాక వీణ్ణి హాస్టల్లో అదాటున చూచినప్పుడు నేనే గుర్తుపట్ట లేక పోయినానంటే నమ్ము ! వీడు హాస్టలు వరండాలో నుంచుని అటువేపు తిరిగి ఫ్రెండ్సుతో బాతాఖానీ వేస్తుంటే చూసి, 'ఎవరా, యీ ఎగుబుజముల వాడూ ?' అనుకున్నాను. తీరా ఎదుట పడి చూద్దునుగదా — వీడూ ! అపళాన తీసి ఒక్కటి వీపుమీద వేద్దామనిపించిం దనుకో." అంటూ భళ్లుమని నవ్వాడు మామయ్య.

సూర్యం కూడా నవ్వాడు, అతి సహజంగా. తనూ నవ్వింది. నవ్వి —

"అది సరే మామయ్యా ! మరి పొడుగు పెరగటం అతడి తప్పుకాదుగా?" అంది.

ఈ మాటల్ని తను మామయ్యకు సమాధానంగాఅన్నా, ఉద్దేశించింది మటుకు సూర్యానికే, తను అతడి పక్షం అయినట్టు మాట్లాడితే అతడి రియాక్షను ఎలా వుంటుందో చూడాలని. చూచి, అతడు ఉత్సాహంతో పొంగిపోతే, అతణ్ణి 'ఫూల్' ని చేశామన్న తృప్తితో కసితో, నిర్లక్ష్యంతో నవ్వుకోవాలని తన ఆశ.

ఐతే యేంలాభం ? సూర్యభగవానుడు నోరు విప్పి మాట్లాడితేనా ? ఎప్పటికీ చిరునవ్వే — ఒకటే చిరునవ్వు. మాయదారి నవ్వు.

తనకు కోపం వొచ్చింది. తన ఆశ నిరాశై, కసి బూడిదలోపోసిన పన్నీరై ఆత్మాభిమానం పూర్తిగా దెబ్బతిన్నది. తానిక మాట్లాడదల్చుకోలేదు. ఎందుకూ మాట్లాట్టం ? మాట మాటకూ నవ్వుతూ ప్రేలుతూ 'రెస్పాండ్' కాలేని మనుషుల్తో మాట్లాట్టం ఎంత రోతని !

కానీ, తను మాట్లాడ దల్చుకోనట్టే, మామయ్య మాట్లాట్టం మానదల్చుకోలేదు. ఆయన ధోరణి అవ్యాహతం. గంగా ప్రవాహం. రేడియో ట్యూన్ చేసి వదిలినట్టు, ఆయనకు మాట అందించే వాళ్ళుంటే సరి, తరువాత కథ వెండితెరపై చూడాల్సిందే నంటాడు.

తను అన్నమాటకు జవాబుగా, సూర్యం అంత పొడుగు పెరగటం పదహారణాలా తప్పేనని మామయ్య సిద్ధాంతీకరించేశాడు.

"తప్పా, తప్పున్నరా? అసలు చిన్నప్పుడు వీడెలా వుండేవాడను కున్నావ్? ఈడ్చి కొలిస్తే జానెడుండే వాడు. పొద్దున్న లేవగానే వూరంతా సర్వే చేసి ఏదో వొకతగూ యింటిమీదికి తేందే నిద్ర పట్టేది కాదు వీడికి—'' అంటూనే ఒక్కసారి గతంలోని పరి గెత్తాడు మామయ్య.

''— ఒకసారి వీడేం చేశాడను కున్నావ్? మా పెరట్లో పొట్లపాదుపెడితే, వచ్చి ఆ మొక్కలన్నీ పీకిపారేశాడు. నాకు కోపంలో ఒళ్లూ పై తెలిసిందికాదు. ఆవటాన వీణ్ని పట్టుకుని, మనం పాత తలగడాను దులుపుతాం చూడు—ఆ విధంగా చింతకొమ్మతో వాయించేశాను. వీడి వళ్ళంతా కందిపోయి వాతలు పడ్డ దాకా, చేతిలోని చింతకొమ్మ విరిగి పోయిందాకా, చేతులు నొప్పులు పుట్టే దాకా—నాకు వొళ్ళు తెలిసింది కాదంటే నమ్ము!" అని తనవేపు చూశాడు. సూర్యం కూడ తనవేపు చూశాడు, నవ్వుతో.

అప్పుడు తనలో ఏదో ప్రకంపనం కలిగి, అది కంఠం కాదా వచ్చి ప్రేరే పించగా—

''ఇందులో నమ్మక పోవటానికేముంది మావయ్యా? చిన్నప్పుడు నీ చేత మేం తిన్న దెబ్బల్లో అవెన్నో భాగం?" అని నవ్వింది. తను మామయ్యను తప్పుపడుతున్నట్టుగా యీ మాటలనటం—ఎదురుగా కూచుని వున్న సూర్యం పక్షాన మాట్లాడినట్టు కనిపిం చేందుకూ, అతడిలో ఉత్సుకతను ప్రేరే పించేందుకూ.

అతడేమనుకుంటున్నాడు తన్ను గురించి? అతడు తనకు నచ్చకపోయి నప్పుడు అతడేమనుకున్నా, ఏ యేట్లో దూకినా తనకు నిమిత్తంలేదు. అయినా, తెలుసుకోవాలన్న ఉబలాటం పొంగు కొస్తున్నది. జీవితంలో కొత్తవ్యక్తుల్ని చూడగానే, వాళ్ళ మంచిచెడ్డల్నీ స్థితి గతుల్ని గురించి ఏ మాత్రమైనా తెలీక పూర్వమే, వాళ్ళనుగురించి మనస్సులో అనియంత్రితంగా, మన ప్రయత్నమేమీ లేకుండానే, ఓ అభిప్రాయం, అంచనా ఏర్పడుతయ్.

ఆ ప్రకారం—ఇప్పుడితని మనస్సులో తనమీదవున్న అభిప్రాయం ఎలాంటిది? తనకు లబ్ధమయిన అంతస్తు ఏపాటిది? తెలుసుకోవాలని తహతహ పడ్డదిజానకి.

కానీ, ప్రయోజనంలేదు.

సూర్యం ఉలికాడా? లేదు. పలికాడా? లేదు. ఏదో దయతలచిన వాడల్లే మళ్ళీ ఓ చిరునవ్వుమాత్రం నవ్వాడు.

జానకి రెచ్చిపోయింది. "ఉత్తి నిర్లక్ష్యమేకాదు. పొగరుకూడా—" అను కుంది. ఆమెకోపం అవధులు దాటింది.

మామయ్య మళ్ళీ ప్రారంభించాడు.

"ఇంకోసారి ఏమైందనుకున్నావ్?"

జానకికి మండుకొచ్చింది. "ఏమయిందో చెప్పరాదూ? ప్రతిసారీ ప్రశ్నార్థకాలుపెట్టి చంపకపోతే! పాడు నస్పెన్సు," అంది. నిజానికి ఆకోపం సూర్యంమీదిది; లోపల అదుముకోలేక మామయ్య మీదికి తిప్పిది.

అయితే ఆ మాత్రం కోపతాపాలకే భయపడిఉపన్యాసంకట్టిపెట్టేస్తేమామయ్య గొప్పతనం మాత్రం ఏముందీ? 'దూషణ భూషణ తిరస్కారంబులు శరీరంబునకే గాని ఆత్మకుంగావని' నిర్ధారణ చేసుకున్న మామయ్య, జానకి కోపంగా అన్న మాటల్ని తనకి ప్రశంసావాక్యం కింద జమచేసుకుని, మామూలు ధోరణిలో పడ్డాడు.

"ఏమయిందంటే—చిన్నప్పుడు వీడు రోజూ బడికెళ్ళనని ఒకటేగోల. ఓరోజున వీళ్ళమ్మ వీణ్ణి బడికి ఈడ్చుకెళ్ళలేక అవస్థపడుతుంటే నేను సాయంపట్టాను. అలాంటి వాడిప్పుడు..." అని మామయ్య గతంలోంచీ తిరిగి వర్తమానంలోకి వచ్చేశాడు. ఆ తర్వాత యిప్పటి సాంఘిక పరిస్థితుల్ని యథాశక్తిగా చర్చించి, ఉన్నట్టుండి రాజకీయాలమీదికి గెంతాడు మామయ్య.

అంతటితో ఫుల్‌స్టాప్.

అంతసేపూ అవతలిగదిలో కూచుని బట్టలు వెదుక్కుంటున్న 'ఆయన', అప్పుడు ఇవతలికివచ్చి అందరినీ స్నానాలకు లెమ్మన్నారు. సూర్యంతోబాటు వచ్చిన మిగతా ఫ్రెండ్సంతా వెళ్ళిపోయారు. సూర్యం వొక్కడే భోజనానికి నిలిచాడు — అదీ, 'ఆయన' బలవంతం మీద.

భోంచేసేటప్పుడు మామయ్య, "మా సుందరం చాలా బంధుప్రీతి మనిషోయ్! అప్పుడప్పుడూ వస్తూపోతూ వుండేం?" అన్నాడు.

"అమ్మమ్మమ్మమ్మమ్మ! ఎంతమాట! తప్పకుండానూ—" అన్నాడు సూర్యం.

అవతలిగదిలో కూచుని వారపత్రిక తిరగేస్తూ ఆ సమాధానాన్ని వింటున్న జానకి, "అలాగా — ఇతడికి మాట్లాట్టం కూడా చాతవునన్నమాట!" అనుకుంది, హాస్యంగా, కోపంగా.

భోజనాలయ్యాక, 'ఆయన'తో చాలా సేపుమాట్లాడుతూ కూచున్నాడుసూర్యం. అది జానకికి చాలావరకు హాయినిచ్చింది. "మనిషికి పొగరులేదు పాపం-ఉన్నదల్లా కాస్త నిర్లక్ష్యమే" అనుకుంది, కాస్తతగ్గి.

ఇంతలో అంతరంలో కలవరం—

"జీవితంలో కేవలం ఆగంతకుడుగా తారసపడ్డ మనిషి చుట్టూ ఏవిఁటీ భావ సంచారం? ఇది వట్టి 'ఫాసినేషన్'. అనుభవాల మలుపుల్లోపడి కొట్టుకునే నీలాటి యువతి కిది సహజం. కాని ఇది తగదు. నువ్వు పెళ్ళైనదానివని గుర్తుంచుకో." అని ఒకటి రెండుసార్లు చరిచింది ఆవిడ అంతరాత్మ.

అంతరాత్మ చేసిన ఈ ఆరోపణలకు జానకి ఎదురు తిరిగింది. కాని తర్వాత ఒక మెట్టు కిందికిదిగక తప్పలేదు. ఇది బలహీనత అని నచ్చజెప్పింది. దానితో ఆ అంతరాత్మ పుష్కలమైన సంతృప్తిని పొంది నిదురించింది.

కాని—

ఇదెంతవరకూ దోషం? సృష్ట్యాది నుంచీ యిప్పటిదాకా సంభవిస్తున్న ఇలాంటి ఘటనలకు ధర్మశాస్త్రాల్లో 'మార్జిను' లేదుగా (వల్నూ! బహుకాలంగా ప్రయాసతో, ఆశతో, భయంతో, నిష్ఠతో కాపాడుకుంటూ వస్తున్న మనః పారిశుధ్యం-ఒక్క స్వల్పదోషంతో, ఒక్క మానసిక చాంచల్యంతో అంతరించి పోవటం ఎంత అన్యాయం!

ఇలా వితర్కించుకుంది జానకి. తను స్కూలుఫైనలు ప్యాసయింది. ఇంకా పై చదువులకు పోవలసింది. అవకాశాలు తక్కువై మానేసింది.

'ఆయన' ఆరోజు సూర్యానికి ఎంతయినా మర్యాదచేశారు. సహజమేమరి! అతడు యం. బి. బి. యస్; 'ఆయన' ఇంటర్మీడియెట్. అతడు కాబోయే డాక్టరు; ఆయన క్లర్కు - ఎంతతేడా!

ఆ సాయంత్రం తిరిగి హాస్టలుకు వెళ్ళిపోయాడు సూర్యం. వెళ్ళేటప్పుడు 'ఆయన' వద్ద సెలవు పుచ్చుకున్నాక, తన దగ్గరికివచ్చి "వెళ్ళొస్తానండీ!" అన్నాడు.

ఆ మాట తనకి గిలిగింతలు పెట్టింది. "మంచిదండీ." అంది.

* * *

ఆరోజునుంచీ సూర్యం ఆ యింటికి దగ్గరి వాడయ్యాడు. అడపాదడపా వస్తూ పోతూ వుంటాడు.


వచ్చినప్పుడల్లా పూలూ, పండ్లూ, చంటివాడికి బిస్కట్లూ తీసుకొస్తాడు. అంతే; అవి తేవటంతో తన బాధ్యత అంతా తీరిపోయినట్టుగా, అవి జానకి ముందు పడేసి వెళ్ళి వీధిసావిట్లో సుందరంతో బాతాఖానీ వేస్తో కూచుంటాడు.

ఇది జానకికి దుర్భరంగావుంది... అవి తెచ్చినప్పుడు, "ఇవిగోనండీ!" అని తనతో చెప్పి అక్కడ పెట్టి పోతేనేం? అలాంటి ధ్యేం లేకుండా, స్తంభంముందు పడేసినట్టుగా అలా కుర్చీ మీదనో, చాప మీద నో పెట్టి పోవటమేమిటి, ఫక్తు నిర్లక్ష్యంగాకపోతే!

అలాంటి నిర్లక్ష్యమే తన కసహ్యం. అందుకే సూర్యం తనకి నచ్చడు. ఎలా నచ్చుతాడు?

ఇలాంటి వాళ్ళు తనతో మాట్లాడాలనీ, తనని నవ్వించి కవ్వించాలనీ, తనని ఒంటరితనం నుంచి రక్షించాలనీ తనేం యాడవటంలేదు. అయినా —

ఈ యింటికి గృహిణి తను. కాబట్టి ఈ యింటికి వచ్చినవాళ్ళు గృహిణిగా తనకురావలసిన గౌరవమూ, మన్ననా యివ్వటంపద్ధతి. ఇవ్వకపోతే తన మన



స్సెంత బాధపడుతుంది! ఆ మాత్రమేనా 'మేనర్సు' తెలీని వ్యక్తులతో ఎలా వేగడం? ఊరికే చదువుకుంటే సరా?...

ఒకసాయంత్రం పెందరాళే చంటివాడికి అన్నంపెట్టి మేడమీద ఆరుబయట నిద్ర పుచ్చింది జానకి.

—అప్పుడప్పుడే వెన్నెల వస్తూం డటంచూసి ఆశకొద్దీ తనూ అల్లంత దూరంలో చాపమీద దిండు పెట్టుకుని పడుకుంది.

చల్లని వెన్నెల......


మసకగా ఆలోచనలు......

ఆకాశంలో చంద్రకాంతికి జిగేలు మనే మబ్బులఅంచుల్ని చూస్తూ జీవిత మంటే అలా వుండాలనుకుంది జానకి.

కాని — అది సుదూరలక్ష్యం! గగన కుసుమం, ఆకనిపించే చందమామకు మల్లే! దాన్ని చేరాలంటే ఎన్ని నిచ్చెనలు వేయాలి? ఒకవేళ నిచ్చెనలు వేసినా, అందుకోగలమన్న ధైర్యంలేదు.

ఐదేళ్ళకిందట సుందరంతో పెళ్ళైంది జానకికి. పెళ్ళికాకముందు ఓ సంవత్సరం పూర్వమే స్కూలు మానేసింది, స్కూలు ఫైనలు ప్యాసయ్యాక. స్కూలుఫైనలు మంచి మార్కులతో ప్యాసయింది. ఆ సంవత్సరం ఆ 'సెంటరు'లో పరీక్ష రాసిన వాళ్ళందరిలో తనదే ఫస్టు. దానికి గాను ఓ 'మెడల్' కూడా యిచ్చారు. తను చదివిన హైస్కూలు హెడ్మాస్టరూ, తెలిసినవాళ్ళూ, యింట్లోవాళ్ళూ ఎంత గానో మెచ్చుకున్నారు తనని, అప్పట్లో.

అప్పుడే కాదు; తన చిన్నతనంలో ఎప్పుడూ తనని గురించి మెచ్చుకోళ్ళే వినిపించేవి. చదువుకునేటప్పుడూ, చదువు మానేసిన తరువాతా, ఎప్పుడేనా



తను సంజెవేళల్లో చిలుకపచ్చ సిల్కు చీరకట్టి, తల్లో పట్టెడు పూలూ, మొహాన సింధూర తిలకమూ ధరించి దేవాలయానికి వెడితే, చూసిన వారు తనని సాక్షాత్తు లక్ష్మీదేవిలాగున్నావనే వారు. ఆ మహదాకర్షణకు ఆవేశోన్మత్తులై గాఁవల్ను, కొంతమంది తనను ఏ కలెక్టరునో చేపట్ట వలసిన దాని వన్నారు. అప్పుడు తనూ అలాగే అనుకుంది. కాని ఆ అనుకోటానికీ, అనుకున్నట్లు జరగటానికీ అధిగమించలేని దూరం వుందని ఇప్పుడు కాని తెలిసి రావటం లేదు.

కలెక్టరును కాదుగానీ, బిల్లుకలక్టరు సుందరాన్ని చేపట్టింది జానకి. తప్ప లేదు. అప్పటికే పెటపెటలయింది తన తలిదండ్రులకి. తమ ఆర్థిక పరిస్థితికి సమానవుజ్జీగా అప్పట్లో సుందరం కనిపించాడు. 'ఫరవాలేదు' అన్నా రందరూ. తాను మాత్రం, తన మనో మందిరంలో వున్న అపురూప శిల్పాలతో అతడి మూర్తిని పోల్చి చూసుకుంది. అంతరాంతరాల్లో ఏదో అణగని అసంతృప్తి తరంగమై లేచినా, దాని శబ్దం అంత విస్తృతం కాలేదు. 'ఫరవాలేదు' అనుకుంది తనూ.

ఫలితం — ఈ జీవితం.

అంతే. అప్పటినుంచీ యిప్పటిదాకా 'ఫరవాలే'దనే అనుకుంటోంది తను. ఇప్పుడూ, ఫరవాలేదు. భర్తా, బిడ్డా, అత్తగారూ, సొంతయిల్లూ, కాస్త బ్యాంకి అకౌంటూ—వీటన్నిటితో కూడిన జీవితం- ఫరవాలేదు. ఏ మాత్రం హెచ్చుతగ్గులూ లేవు. గొ(రెతోక.

గతాన్నంతా యిప్పుడు సింహావలోకనం చేసుకుంటోంటే, అప్పట్లో భవిష్యత్ జీవితం తనకి ఎలాంటి ఆకర్షణ చూపెట్టిందో ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది. అనుభవాలు వివిధ మిశ్రమాలతో తయారించిన రంగులుగా, జీవితం ఆ రంగులతో జాజ్వలించే ఇంద్ర ధనస్సుగా భావించుకున్న తనకు, ఈ జీవితం బరువుగా, నీరసంగా, 'మొనాటనస్'గా కనిపిస్తోంది. అయినా జీవితం తనని కవ్వించి రేపెట్టనంతవరకు తనకూ జీవితంతో పేచీ లేదు. తనకన్నా ఎన్నో విధాలుగా జీవితాన్ని దిగజార్చుకుని అలమటించే వాళ్ళతో తనని పోల్చుకుని తృప్తితో వూపిరి వదలగల ఇంగితాన్నీ, ఓరిమినీ దేవుడిచ్చాడు తనకి. ఆ మాత్రం చాలు — చాలదూ? గగన కుసుమాలకై ప్రయత్నించటం, ఎండమావుల వెంట వెర్రిగా పరిగెత్తటం తనకు చేతకాని పని.

కానీ—

ఇంతదాకా నిశ్చలంగా, నిశ్శబ్దంగా వున్న సరస్సులో ఏదో పెనుతుఫాను- నిగ్రహించుకోలేని భావసంక్షోభం-

ఇదంతా నెలరోజులున్నంచే!

'ఆయన' రోజూ పదిన్నరకి భోంచేసి ఆఫీసుకు వెడతారు. ఇప్పుడు 'ఆయన'కు

'బిల్లు కలక్టరు'గిరి నుంచీ, 'అప్పరు డివిజన్ క్లర్కు'గా ప్రమోషన్ అయింది- వందా యాభై పైచిలుకు జీతంతో. అలా పదిన్నరకి వెళ్ళి, సాయంత్రం ఐదుకు ఇల్లు చేరతారు.

సరిగ్గా అదే సమయానికి సూర్యం కూడా వస్తాడు. తమాషా యేవిఁటంటే, ప్రతిరోజూ 'ఆయన' వచ్చాకే వస్తాడు సూర్యం. ఏ రోజుగానీ - ఒక్క-క్షణం ముందుగా రాడు - ఏం కొంప మునిగి పోతుందోనని గాఁవల్ను! ఏ ఒక్క-రోజైనా, ఓఅయిదునిముషాలు ముందుగా వస్తేనేం? వచ్చి, "సూర్యం ఇంకా రాలేదాండీ?" అని నోరువిప్పి అడిగి తేనేం? ఉహుఁ! - బెట్టుసరిగాఁవల్ను, వెధవ బెట్టుసరి!

తనకు సూర్యంమీద కోపం తెప్పించే కారణాల్లో ఇదికూడా ఒకటి!

అలా వస్తాడా సూర్యం-అప్పట్నుంచీ 'ఆయన'తో బాతాఖానీ వేసుకూర్చుంటాడు. ఆకబుర్లలో ఒక్క-టీ పనికొచ్చేదిగా వుండదు. అంతా చెత్తా ఖానీ వాగుడు. ఇంకో గమనించదగ్గ విషయం ఏమిటంటే ఆకబుర్లలో సూర్యం అందరి సంగతీ ప్రస్తావిస్తాడు. తనని గురించి కూడా!

ఒకరోజు వాళ్ళు మాట్లాడుకుంటుంటే తను ముందరి హాల్లో బీరువా దగ్గర నిల్చుని వింటోంది. సూర్యం అంటున్నాడు 'ఆయన'తో: "మీ యావిడ చాలా అమాయకంగా కన్పిస్తుందోయ్! ఈ కాలపు వాళ్ళలా కాదు ... అలాంటి వాళ్ళంటే చాలా యిష్టం నాకు."

ఈ మాటలకి సంతోషించాలో, కోప్పడాలో అర్థంకాలేదు జానకికి. నయమే - ఈ నాటికి తనంటే యిష్టమని చెబుతున్నాడు-తనమీద దయతలచినవాడై! మరి ఇతగాడికి తనలో ఏం అమాయకత్వం కనిపించిందో! తనలో ఇంత అమాయికత్వాన్ని చూచేందుకు ఈయన ఏ మాత్రం మేధావంతుడని!

ఇలాంటి ప్రశంసలు తనకేం అఖ్ఖ-ర్లేదు. ఎవరినేనా ఎదటివాళ్ళను అమాయికులుగా భావించే మనుషుల్ని చూస్తే తన కెందుకో కోపం వస్తుంది. అలా భావించటం పైకి జాలిగా, సానుభూతిగా కనిపిస్తుంది కాని, ఆ ముసుగు తొలగిస్తే లోపల కనిపించేది అవహేళన - జాలిగా చెలామణీ అయ్యే నిర్లక్ష్యం-అలుసూ-నిరాదరణా-ఇలాంటివి.

ఇది తను భరించలేదు. తనని గయ్యాళి అన్నా, క్రూరాత్మురాలన్నా, ఆఖరికి కులటఅన్నా తను భరించగలదు. కాని - అమాయకురాలని అంటేమాత్రం తను భరించలేదు. ఆత్మగౌరవానికి అంత కన్నా పెద్దదెబ్బ యింకోటి లేదు...

ఇన్ని ఆలోచనా పరంపరల ఫలితంగా, అప్పుడు సూర్యం జానకికి సుందరం సమక్షంలో దయచేయించిన 'కాంప్లిమెంటు' ఆవిడకే మాత్రం సంతోషం

కలిగించడంకానీ, అభిరుచుల్ని రేకెత్తించటం కానీ చెయ్యలేక పోయింది, సరి కదా — కాస్త కోపం తెప్పించింది ... సుందరం మాత్రం సతోషించాడు. కాని ఆ మాటలపై అతడూ వ్యాఖ్యానమేమీ చెయ్యలేదు.

ఇప్పుడు సూర్యం ఆ యింటికి పాత మనిషయ్యాడు, నెలరోజుల సాంగత్యం ఫలితంగా. సుందరాన్ని యిదివరకులా 'సుందరం!' అని కాక 'బ్రదర్' అనీ 'అన్నయ్యా' అనీ సంబోధిస్తూంటాడు. కొత్తలో యీ సంబోధనచూచి జానకికి ముచ్చటేసింది. "ఇదేం వరస?" అని ముసిముసిగా నవ్వుకుంది. "బాగానే వుంది, చుట్టరికం!" అని సమాధానం చెప్పుకుంది, ఆత్మగతంగా.

అప్పుడప్పుడూ సూర్యం చాలా చిత్రమైన మనిషని అనుకుంటుంటుంది జానకి. దీనికో కారణంవుంది. అతడు ఇంటికి వచ్చి కూచున్నంత సేపూ జానకిని 'కులాసాయేనా?' అనైనా పలకరించడు. అయితే గంటల తరబడీ కూచుని, సుందరంతో పనికిమాలిన వాగుడంతా వాగి తిరిగి వెళ్ళిపోయేటప్పుడు మాత్రం జానకి దగ్గిరికి వచ్చి, "వెళ్ళొస్తానండీ..." అంటాడు, కొద్దికొద్దిగా తెరుచుకున్న పెదాల్లోంచి చిరునవ్వు పొదుపుగా చిందిస్తూ!

దీనికేమని భాష్యంచెప్పుకోవాలో జానకికి బోధపడదు. మాట్లాడని మనిషి అసలే మాట్లాడకుండాఉంటే బాగుండిపోదూ? తనదగ్గర యిలా సెలవుపుచ్చుకు పోలేదని ఎవరేడ్చారు? అతడువచ్చినట్టూ, వెళ్ళిపోతున్నట్టూ తనకు తెలియజెయ్యటానికి గాఁవల్ను — స్కూల్లోహాజరు వేయించుకున్నట్టు!

ఈ 'వెళ్లొస్తానండీ' లే తనకి ప్రాప్తమేమో!

ఇటీవల పదిరోజుల్నుంచీ సూర్యానికి చంటివాడు మాలిమి అవుతున్నాడు. చంటివాడి పేరు రాధాకృష్ణ. వాళ్ళ తాతయ్య పేరు పెట్టారు వాడికి. ఆయన పేరు రాధాకృష్ణయ్య అయితే, ఈకాలపు ఫేషనుగా 'అయ్య' అనేది తీసేసి 'రాధాకృష్ణ' అని పెట్టారు. దంపతులిద్దరూ వాణ్ని 'బుజ్జిగా' అని పిలుస్తారు. సూర్యం మాత్రం వాడి పేరునే మరికాస్త తుంచి, కాస్త మెలితిప్పి 'రాధీ' అని పిలుస్తాడు. అతడు ఒక్కొక్క రోజు సాయంకాలం వేళవచ్చి, సరాసరి వెళ్ళి 'ఆయన' గదిలోకూచుని, చంటివాణ్ని వుద్దేశించి "రాధీ, ఇదిగో బిస్కట్లు" అనగానే, యీ రెండేళ్ళ వెధవ వురుకులు పెట్టుకుంటూ వెళ్ళి, నోట్లోనుంచీ నిరంతర ధారావాహికంగా కారే చొంగతో అతగాడి చొక్కాసంతా తడిపేస్తుంటాడు. అలా తడిపేస్తూన్నప్పుడు జానకి నవ్వుకుంటూవుంటుంది.అప్పుడు ఆవిడకి అదో రకమైన సంతోషం.

ఒక రోజున మామూలు ప్రకారం సూర్యంవచ్చి వెళ్ళిపోయేటప్పుడు జానకి



దగ్గిరికి వచ్చి "వెళ్లొస్తానండీ!" అన్నాడు. అంతవరకూ ఆ వెళ్లొస్తానండీలకు అలవాటు పడివున్న వ్యక్తి కావటంవల్ల జానకి యాదాలాపంగా, నీరసంగా 'సరే' నన్నట్టు తల తిప్పింది.

అంతటితో ఆగిపోయివుంటే, ఆరోజు జరిగిన యీ సర్వసాధారణమైన యీ సంఘటన గురించి యిప్పుడు అనుకోవలసిన అవసరం లేకనేపోను. కాని అది అలా ఆగలేదు.

అప్పుడు జానకి చంటివాణ్ని చంకనేసుకొనివుంది. వాడి మొహాన్ని పట్టుకుని సూర్యం వేపుతిప్పి, "బుజ్జిగా, బాబాయికి టా టా చెప్పు!" అంది. వాడు

అలాగే వచ్చీరాక 'టాటా' అంటుంటే అతడుకూడా వాడి మొహం దగ్గర మొహం పెట్టి నవ్వుతూ 'టాటా' అన్నాడు. అదేనవ్వుతో జానకివేపు గుచ్చి గుచ్చీ చూశాడు. జానకి సిగ్గుతో తలవంచుకుంది.

అప్పుడలా సిగ్గుపడ్డందుకు ఆ తరువాత చాలా బాధపడింది జానకి. అతదేమనుకున్నాడో! తను ఎంత అలుసై పోయిందో అతడిముందు! మరి అతడుమాత్రం — పరాయి ఇల్లాలినలా శల్యపరీక్షగా చూడటం ఏవంత సజావైనపని?

ఆ రాత్రి సుందరానికి వడ్డిస్తూ ఇదే ప్రస్తావన తీసుకొచ్చింది.

"అది కాదండీ —" అంది వుపోద్ఘాతంగా. అన్నం ముద్ద నోట్లో పెట్టబోతున్న సుందరానికి ఆ వుపోద్ఘాతం ఏ వుపన్యాసానికి నాందీ కాబోతున్నదో అర్థంకాక తలెత్తి చూశాడు.

"మీ ఫ్రెండు భలేవాడండీ!" అంది.

"ఏం?"

"ఏం లేదు... మనుషులవేపు అలా చూస్తాడేవిఁటీ, కాస్తంతయినా మర్యాద అనేది లేకుండా?

"చాల్లేద్దూ!...సూర్యం అలాంటివాడు కాదు జానకీ! అద్దంలాంటి మనస్సతడిది —"

"అవునవును! అతడి మనస్సు అద్దం లాంటిదీ, మీ మనస్సు బొమ్మలాంటిదీ బాగానేవుంది సమర్థన!''

"నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు జానకీ! సూర్యం అలాంటి వాడంటే నే వొప్పుకోలేను. అత డేదో పరధ్యాన్నంగా చూసి వుంటాడంతే! అది చూచి నువ్వు అపోహపడి వుంటావ్!... అయినా — నీకు కోపం వస్తుందేమో గాని జానకీ — మీ ఆడాళ్ళంతా యింతే ననుకో! మహాసూక్ష్మం పడతారు —"

జానకి జవాబివ్వలేదు. మూతి ముడుచుక్కూచుంది. అది చూచి సుందరం పెద్దగా నవ్వాడు. జానకి కూడా నవ్వకుండా వుండలేకపోయింది.

అవును! 'ఆయన' చెప్పేది నిజమే! సూర్యం అలాంటి వాడు కాదని తనలోనే ఏ మూలో శబ్దమవుతో వుంటే తనకు దుర్భరంగా వుంది. సూర్యం అలాంటి వాడే అయితే! అతడు తన అందాన్నంతా తాగేసేటట్టు తనవేపు చూస్తే! అతడు దేన్నో యాచిస్తున్నట్టుగా తనవేపు చూచినప్పుడు, అతణ్ని ఒక్కసారి అవతలికి దులిపేసి...అప్పుడెంత ఆనందం!!

తను కూడా ఏ సూర్యంలాంటి వాణ్నో పెళ్లాడి ఆనంద డోలికలల్లో తేలిపోతూ వుండవలసింది...దేవుడు చిన్న చూపు చూచాడు! తనకింత అన్యాయం ఎందుకు జరగాలి? ఈ అన్యాయానికి తనెంతవరకూ తలొంచాలి?

అంతలోనే సిగ్గుపడ్డది జానకి. తనింత దూరంగా ఆలోచిస్తున్నందుకు కించపడ్డది. తనలో మానసికంగా ఏమిటీ పతనం? ఉత్తుంగ శిఖరాల మెరుపు అంచుల్లోంచి చీకటి లోయల్లో పడిపోతోంది తను. ఈ పతనాన్ని ఆపలేని నిరాశా నిస్పృహలు గుండె మోతకు కళ్లెం పెడుతూ హృదయంలో ప్రతిధ్వనిస్తున్నయ్!

కానీ — ఇది తప్పా? లభ్యమయిన దానికీ, దూరమైన లక్ష్యానికీ ఊహా నిశ్రేణికలు వేసి కొల్చుకోవటం, మనసును కాల్చుకోవటం, క్షమించరాని అపరాధాలా?

అంతులేని ఆలోచనా సముద్రంలో అవతలిగట్టున కనపడక ఉక్కిరి బిక్కిరయింది జానకి.

* * *

వారంరోజులు గడిచాక ఒకనాటి మధ్యాహ్నం చంటివాడికి సన్నగా జ్వరం తగిలింది. ప్రారంభంలో అదే తగ్గిపోతుంది లెమ్మని జానకి నిర్లక్ష్యం చేసిందిగాని, నాలుగోరోజున అది మోపుజూపింది. జానకి భయపడ్డది. సమయానికి అత్తయ్యకూడా యింట్లో లేదు. వూళ్ళోనే ఎవరో బంధువుల యింటికి వెళ్ళింది. 'ఆయన' అసలు వూళ్లోలేరు. ఏదో ఆఫీసు పనిమీద మద్రాసుకు వెళ్లారు. వచ్చేసరికి రెండు రోజులు ఆలస్యం అయినా కావచ్చు.

జానకికి ఏంచేసేందుకూ పాలుపోలేదు. ఇంతవరకూ మనస్సులో కదలాడుతున్న వెర్రిమొర్రి తలపులన్నీ అదృశ్యమైపోయి, వాటిస్థానే చంటివాణ్ణి గురించిన భయాందోళనలు పూర్తిగా ఆవరించుకున్నాయి.

ఈ చంటివాడు తన పెన్నిధి! తనలో స్త్రీయైన తనలో, నిండార ప్రవహించే మాతృత్వ దిదృక్షకు భావాన్ని, తాత్పర్యాన్ని కల్పించిన జీవస్వరూపం! ఇన్నాళ్ళుగా ఒక మహత్తర సంప్రదాయానికి కట్టుబడి తాను నిర్వహించిన గార్హస్థ్య ధర్మానికిగా తనకు లభించిన వరం! తన బ్రదుకుకు బంగారు బాటగా, తన జీవిత నౌకకు చుక్కానిగా కనిపించాడు వీడు! తన పంచప్రాణాలన్నీ వీడిమీదనే పెట్టుకు బ్రతుకుతోంది.....

అలాంటిది — ఇప్పుడు వీడికి ఒంట్లో నలతగావుంటే తన హృదాయ నాళాలన్నీ సాగి బాధపెడుతున్నాయి. గ్రహచారం కొద్దీ యీ జర్వం ఎక్కువై... ఇక ఆపైన ఆలోచించలేక పోయింది జానకి. ఆలోచించకుండానూ వుండలేకపోయింది...వీడు తనకు దూరమైపోతే, తన జీవితాశలన్నీ ఏంకాను?

ఈ భయదాలోచన దుఃఖమై ఘనీభవించింది. కన్నీరై నిండింది. తనని దేవుడు పరీక్షిస్తున్నాడా? కుదురైన యింటి యిల్లాలుగా తను చేయరాని ఆలోచనలు చేసినందుకు తనని శిక్షిస్తున్నాడా?

అయినా ఇదేమిశిక్ష? తన తప్పుకు తననే శిక్షించాలిగాని, నోరూవాయీలేని యీ పసివాణ్ని శిక్షించటం ఏమిన్యాయం?

చంటివాడు మగతగా నిద్రపోతున్నాడు. ఈ నాలుగు రోజుల్నుంచీ సరైనపోషణ లేకపోవటం మూలాన, ముద్దులుమూట గట్టే వాడిమొహమంతా వాడిపోయి వుంది. తనజ్వరం గురించీ, అమ్మపడే ఆవేదన గురించీ ఏ మాత్రం పట్టించుకోని వాడల్లే అమాయికంగా నిద్రపోతున్నాడు వాడు.

"భగవంతుడా! నా వల్ల దోషముంటే నన్నేమైనా చెయ్యి. ఏ శిక్షయినా విధించు. చిరునవ్వుతో సహిస్తాను. కాని ఏనేరమూ ఎరగని నా పాపకు మాత్రం ఎలాంటి ఆపదా రానీకుస్వామీ!" అని మనసులో ప్రార్థించుకుంది జానకి.

అప్పటికీ మనసు నిలువలేదు. దుఃఖం ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చింది జానకి. అలాగే దుఃఖిస్తూ,చంటివాడు పడుకున్న మంచం పట్టెకు తల ఆనించి కూచుంది.

అలా ఎంతసేపు కూర్చునేదో, ఎంత కన్నీరు ప్రవహించేదో తెలీదు — అంత లోనే సూర్యం వచ్చాడు — "వదినా" అంటూ.

జానకి తడబడుతూ లేచింది. అసలే ఆమెకు ఆశ్చర్యకరంగా, కొత్తగావుంది, సూర్యం సంబోధన. ఇంతవరకూ అతడి నుంచి 'వెళ్ళొస్తానండీ' అని వినటమే అలవాటయివున్న ఆమె మనస్సుకు, ఈ పిలుపు మార్దవత్వం కల్పించి, ఏదో పెద్దరికాన్ని ఇచ్చి, మరెన్నో కొత్త అనుభూతులను కలిగించింది.

"వదినా!!...ఏడుస్తున్నావా?"

"లేదయ్యా!" అని అన్నదే కాని, అంతకుమించి తను దుఃఖిస్తున్న వైనం దాచిపెట్టదల్చుకోలేదు జానకి.

ఈ అనుభవం మధురంగా తోచింది. అంత దుఃఖంలోనూ యీ మాధుర్యం చల్లగాలివలె ఓదార్చుతోంది జానకిని. తనకో మరిది అంటూ లేకపోవటంవల్ల యీ అనుభవం ఇంతవరకూ తన వూహకు అందలేదు!...ఈ యువకుడు తన మరిది. యం. బి. బి. యస్. డాక్టర్!

కన్నీళ్ళైనా తుడుచుకోకుండా అలా నిలబడిపోయిన జానకిని చూస్తూ ఒక్క క్షణంపాటు నిలబడ్డాడుసూర్యం. మరు క్షణంలో తెప్పరిల్లి, గొంతు సవరించు కుంటూ. "నన్ను క్షమించు వదినా!" అన్నాడు!

జానకికి అర్థంకాలేదు.

"అన్నయ్య మద్రాసుకు వెళ్ళే టప్పుడు నాతోచెప్పే వెళ్లాడువదినా!... 'రాధిగాడికి వొంట్లో నలతగావుంది; కాస్త ట్రీట్మెంటు విషయంలో కనిపెట్టి వుండ'మని చెప్పాడు. కాని...''

"మర్చి పొయ్యావు — అవునా?"

"అబ్బే...లేదొదినా!

"మరేమిటి?...జ్ఞాపకంవున్నా రావటానికి మనసొప్పలేదా? అవున్లే – ఎందుకు వొప్పుతుంది? రావలసిన అవసరం నీకేమిటి గనక? నీక్కావలసిందల్లా మీ అన్నయ్య ఒక్కడు. అదీ, ఖాతాఖానీ వేసేందుకు! అంతేగదూ?... ఇహ మిగతావాళ్ళమంతా ఎలా పోయినా, ఏ యేట్లో కలిసినా నీకు నిమిత్తంలేదు–"

సూర్యం అప్రతిభుడై వింటున్నాడు. ఇలాంటి మాటల్ని జానకి నోటినుంచి వినటం ఇదే ప్రథమం! ఈమె యిలా మాట్లాడుతుందనీ, మాట్లాడగలదనీ తను వూహించనైనా లేదు! ఇన్నాళ్ళుగా తను ఈ వదినెతో నిండుగా మాట్లాడేపాటి చనువు తీసుకుందామనుకున్నా, అందుకు తనలోని బిడియం, జంకూ, చదువూ, హోదా–ఇన్ని అడ్డువచ్చాయి. అలాంటిది, యిప్పుడీ విధమైన మాటల్ని వింటుంటే బాధకలగటంలేదు సరికదా, ఏదో హఠాత్తుగా ఆత్మగోచరమయిన దగ్గరతనం ఉక్కిరిబిక్కిరి చేసివేస్తోంది. తను తీసుకోలేని చనువును ఇన్నాళ్లుగా యీమె హృదయగతంగా పెంచుకుంటూ వస్తున్నదన్న మాట!

అలా అప్రతిభుడైన స్థితిలోనే జానకి వేపు చూశాడు. స్త్రీ సహజమైన ఆవేశ గుణంతో మాట్లాడి వుండటంవల్ల ఆమె కళ్ళనిండా నీళ్లు కమ్ముకుని వున్నయ్! ఆ కన్నీళ్ళ కతడేమీ జవాబు చెప్పలేనట్టుగా తడబడుతూ, "అది కాదు వదినా!" అన్నాడు.

"ఏదయ్యా కాదు? మేం లెక్క చెయ్యదగిన వాళ్ళం కాదంటావా? సరే పోనీ–మాది నీకన్నా తక్కువ అంతస్థు. మేమంటే నువ్వు లెక్కచెయ్యనవసరం లేదు. అయినా చంటివాడికి ఇంత వుపద్రవంగా వుంటే వచ్చి చూడాల్సిన బాధ్యతైనా లేదా? ఆ మాత్రమేనా నేర్చుకోనివాడివి రేపు డాక్టరువైతే మాత్రం దేశానికేం సేవ చేస్తావు? ఇలాగేనా–?"

ఇన్ని తీవ్రమైన మాటల్నీ మౌనంగానే విన్నాడు సూర్యం. నోరువిప్పలేదు.

"ఇదేమిటొదినా? ఇలా ఎన్నడూ మాట్లాడలేదే నువ్వు? చెప్పేదైనా వినిపించుకోకుండా యిలా మాట్లాడితే నేనేం చెయ్యను?'' అన్నాడతడు చివరికి. కాని కోపంతోకాదు. ఆవిడ మాటలకు కోపం చేసుకోవలసిన అవసరంకూడా లేదనిపించింది. చిరకాలంగా నీరునింపుకుని ఆకాశపు మారుమూలనున్న మేఘశకలం ఒక్కసారి విజృంభించి మన్నూ మిన్నూ ఏకం చేసివేసినట్లున్నయ్ జానకి మాటలతనికి. ఆ మాటలు అతని గుండెకు తూట్లువేశాయి.

నిజంగా తనది తప్పేనేమో! తను మానవతకూ, ఆర్ద్రతకూ దూరంగా ప్రవర్తించాడేమో! లేకపోతే, యింత కాలం మౌనం ముద్రకట్టినట్లుండిన ఈవిడ అలా ఎందుకు మాట్లాడుతుంది? ఈవిడే

ఆ మాటలన్నీ అన్నదా? లేక ఏ దేవ
తలో తన ప్రవర్తనకు కినిసి అలా అని
పించారా?...ఎంత భయంకూడా కలి
గింది సూర్యానికి. కాని ఆ భయాన్నీ,
తనకే సందేహాస్పదంగా వున్న తన
తప్పునూ జానకిముందు అంగీకరించి
నట్లుగా మౌనం వహించటం అవమాన
మనిపించింది.

"వదినా!...నేను చెప్పేది విని
పించుకుని తరువాత ఎన్నైనా అను".
అన్నాడు.

జానకి హిమంలా అయిపోయింది.

"ఏంవినిపించుకోను సూర్యం?...
నీకేం, మహారాజువు! ఒకసారైనావచ్చి
చూడనందుకు ఎన్ని సాకులేనా చెప్పే
పాటి ఓర్పూ, స్థిమితమూ నీకుండొచ్చు
గానీ, నా కెలా వుంటాయిచెప్పు?...
కాస్త యిలా వచ్చిచూడు సూర్యం!
చంటివాడి కెలావుందో చూడు—నిన్నటి
నుంచీ వాడు మూసిన కళ్ళు తెరవలేదు.
ఆడదాన్ని — నేనేం చెయ్యగలను?
నిన్నటినుంచీ నిద్రాహారాలు మాని సేవ
చేస్తూకూచున్నాను. నే నెంత శ్రమపడితే
ఎవరు లెక్కచేస్తారు? ఎవరిక్కావాలి
నా గొడవ. ఇంత దగ్గిర వాడివి నువ్వే
పట్టించుకోనప్పుడు?..."

జానకికి దుఃఖం నిలవలేదు. కన్నీళ్లు
ఆగలేదు. చేతుల్లో మొహం దాచుకుని
ఏడవసాగింది. సూర్యం అయోమయంలో
పడ్డాడు. ఏదో అజ్ఞాత శక్తి ఈమె
దుఃఖానికి బాధ్యతనంతా తన నెత్తిమీద
పెట్టి అదుముతున్నట్టుంది. ఈ పరిస్థితి
అతనికి దుర్భరంగావుంది. ఈమె యిలా
ఏడవటంమాని, కోపమంతా తీరేదాకా
తనని తిట్టినా బాగుండును! అప్పుడు
తనంత బాధపడేవాడు కాదు!

"ఏడవకు వొదినా!" అన్నాడతను.
ఆమె దగ్గరగావచ్చి, ఆమెను చేతుల్తో
పొదివి పట్టుకుంటూ. ప్యాంటు జేబు
లోంచి జేబుగుడ్డతీసి ఆమె కన్నీళ్ళు
తుడిచాడు.

"నాకేం తోచటంలేదు సూర్యం! నిన్న
ట్నుంచీ మరీ జీవితంమీద అసహ్యం
రేకెత్తుతోంది. ఎందుకో జీవితాన్ని
నడిపే అతీతశక్తులన్నీ నాకు వ్యతిరేకంగా
నిలబడి నా సర్వస్వాన్నీ నాశనం చెయ్యా
లని చూస్తున్నట్టున్నయ్! ఇన్నాళ్ళ
నుంచీ నా జీవితాశలన్నీ ఎవరిమీద
కేంద్రీకరించుకుని జీవిస్తున్నానో, వాడినే
నాకు దూరంచెయ్యటానికి దేవుడుకూడా
ప్రయత్నిస్తున్నాడు! ఇక నేనెవరికోసం
బ్రతకాలి? ఎందుకోసం బ్రతకాలి?...
సూర్యం! బాబిగాడికి నయమౌతుం
దంటావా?"

జానకి మాట్లాడుతున్నంత సేపూ
ఆమెకు పరిసరాలమీదా, పరిసరాల్లో
వ్యక్తులమీదా ధ్యాసలేదు. ఎన్నోరోజు
లుగా తనకు తెలియకుండా, అవ్యక్తంగా,
మౌనంగా లోపల అణగిమణగివున్న
ఉద్వేగ పరంపర తన ప్రమేయమేమీ

లేకుండానే బయటికి పొంగుకువస్తున్నట్టుంది. అదంతా యిలా వెళ్ళబోసుకుంటే గాని—యిలా స్వయంగా తన ఆవేదనను వ్యక్తీకరణ చేసుకుంటే గాని — తెరపి కలిగేటట్టులేదు. ఈ ఆవేశంలో —— ఆవేదనలో —— ఇంతకాలం తనకు దూరంగా వుండిన ఏదో ఉపశమనాన్నీ, తృప్తినీ ఆమె కోరుతున్నట్లనిపించింది సూర్యానికి.

అతడికి జాలేసింది.

"ఊరుకో వదినా ! ఏమిటా పిచ్చి మాటలు ? అనుభవాలన్నీ గడిచి వార్థక్యంలో పడినవాళ్ళకేవుండదే ఈ విరక్తి ! నీ కెవరు నేర్పారు వదినా ?...ఒదినా ! ఒక్క మాట చెప్పనా ! మనుషుల్ని గురించి అంచనాలు వేసుకోవటంలో నేను పూర్తిగా ఓడిపోయానని నీ ముందు ఒప్పుకుంటున్నాను ...... ఇన్నాళ్ళూ నువ్వే మాత్రం తొణక్కుండా, ఒక్క మాటైనా మాట్లాడకుండా వుండటం చూసి, 'మా వదినగారు చాలా గంభీరమైన మనిషి!' అనుకున్నాను. కాని ఆ బాహ్య గాంభీర్యం వెనక ఇంత మెతకదనమూ, ఊరికే జేంబేలెత్తిపోయే మనస్సూ వున్నాయని యింతవరకూ, ఊహించనైనా లేదంటే నమ్ము !..."

**"ఆడవాళ్ళ** మనస్సు నీకు తెలీదు సూర్యం ! పైగా యింత వుపద్రవం —"

"చాల్లే వదినా : అంత ఉపద్రవం ఏ మొచ్చిందని ?" అన్నాడు సూర్యం



''మాటి మాటికీ నన్ను బుర్రలేనివాడివి—బుర్రలేనివాడివి అని అనకండి సార్ ! ఇదుగో !...మీ తలకాయ కాస్త సేపు తీసిపెట్టి ఇది పెట్టుకొని చూడండి — ఎంత బెటరో మీకే తెలుసుంది !"

అడ్డుపడుతూ. జానకి మొహం వికసించింది. ''రాధిగాడికి నయం కాదని ఎవరు చెప్పారు నీకు? లేక నువ్వే కలగన్నావా?.. వెర్రి వదినా ! అలాంటి భయాలేమీ పెట్టుకోకు. వాడి జ్వరం నాలుగు రోజుల్లో తిరుగు ముఖం పట్టకపోతే నాదీ పూచీ. సరేనా ?"

తరువాత సూర్యం చంటివాడికి చెయ్యి చూశాడు. జేబులో పెట్టుకొచ్చిన 'డ్రగ్ కేసు'లోంచి మందులూ, థర్మామీటరూ తీసి, టెంపరేచరు చూశాడు. టెంపరేచరు నూరుకుపైగానే వుందిగాని, ఇంతకుమించి ఎక్కువయ్యే సూచనలేమీ లేవు.

టెంపరేచరు తగ్గటానికని ముందుగా ఇంజక్షను ఒకటిఇచ్చాడు. తర్వాత మరేదో

''ముక్చరు' కలిపి తాగించాడు. కాస్సేప య్యాక మళ్ళీ టెంపరేచరు చూశాడు. కొద్దిగా తగ్గుదల కనిపించింది. సూర్యం ఇంటికెదురుగావున్న సోడాకొట్టులోకివెళ్లి బుట్టతో ఐసు తీసుకొచ్చాడు. దాన్ని కొంచెంగా బ్యాగ్‌లోవేసి చీకటిపడేదాకా చంటివాడికి వత్తుతూ కూచున్నాడు.

అలా ఓ గంటసేపు వొత్తాక, టెంప రేచరు దాదాపు నార్మలుకువచ్చింది. ఇక ఐసువత్తటం ఆపేసాడు సూర్యం. కాని బుట్టలో ఇంకా చాలా ఐసు మిగిలి పోయింది.

"ఉత్తదుబరామనిషివి సూర్యం నువ్వు! చంటివాడికని ఎవరైనా బుట్టెడు ఐసు తెచ్చుకుంటారా? కొద్దిగా తీసుకొచ్చు కుంటే, మళ్ళీ అంతగా కావలిస్తే వెళ్ళి తెచ్చుకునేవాళ్ళం గదా!" అంది జానకి.

''అదికాదు వదినగారూ! ఆ ఐసంతా రాధిగాడికోసమే ననుకున్నారా? కాదు. వాడికిజ్వరం నెమ్మదించేదాకా మీరుకూడా రాత్రీపగలూ కళ్ళల్లో వత్తులువేసుకుని కూచుంటారుగదా — దానివల్ల మీకు తల కాయ వేడెక్కి, ఆ వేడంతా కోపంగా మారి, ఆ కోపాన్ని నామీదా, అన్నయ్య మీదా ఎక్కడ చూపిస్తారోనని మీ కూ్కడా తీసుకొచ్చాను. ఇప్పుడు బుట్టలో మిగిలిపోయిందంతా మీకు.''

ఇద్దరూ నవ్వారు. మనసుల చీకటి గదుల్లో నిలవవున్న మాలిన్యాలన్నీ కొట్టుకుపోతున్నయ్ ఆనవ్వుల్లో. టెంప రేచరు తగ్గిపోతున్నందువల్ల, చంటివాడు కాస్త స్పృహలోకివచ్చి అటూ యిటూ పొర్లుతున్నాడు.

జానకి హాయిగా నిట్టూర్చింది.

గడియారం ఎనిమిది కొట్టింది.

"ఇకనువ్వు వెళ్ళు సూర్యం!'" అంది జానకి.

సూర్యం ఉలిక్కిపడ్డాడు.

"అదేమి టొదినా? నేను వుండ కూడదా?"

''ఊహూఁ. ఉండకూడదు."

అతడు తెల్లబోయాడు. జానకి ప్రవర్తన అతడికేం అర్థం కావటంలేదు. నిజంగానే యీమెకు పిచ్చిపట్టలేదుగదా!..

ఒకవేళ జానకి తమాషాకు అలా అన్నదేమో ననుకున్నాడు. అదే ఆమె నడుగుదా మనిపించింది అతడికి. కాని జానకి మొహంతీరు అలాంటి అభిప్రా యానికి ఆస్కారమే యివ్వటంలేదు! నిశ్చలంగా, గంభీరంగా, ఆదేశిస్తు న్నట్టుగా వుంది. ఏదో అడుగుదా మనుకున్న అతడి నోటికి తాళంపడ్డది — ఆమెలోని ఆ కర్కశత్వాన్ని చూడగానే.

''ఫరవాలేదులే వదినా! ఈ రాత్రికి అన్నయ్య ఎటూ వస్తాడన్నావుగదా... వచ్చేసరికి పొద్దుపోతుందో యేమో!... ఆయన వచ్చేదాకా వుండి వెడతాను...'' అన్నాడు.

"అక్కర్లేదు సూర్యం! ....నువ్వు వెళ్ళు."

"అదేమిటి వదినా? ... ఈ వేళప్పుడు — జ్వరంవచ్చిన వాణ్ని దగ్గర పెట్టుకుని — ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఎలా వుండగలవ్ చెప్పు?... అందులోనూ నువ్వసలే పిరికిమనిషి వాయె.''

''లేదులేవయ్యా! నువ్వనుకున్నంత పిరికి మనిషినేం కానులే ... ఇన్నాళ్ళూ ఒంటరిగా రాత్రిళ్లు గడిపినప్పుడల్లా నువ్వే వచ్చి తోడుపడ్డావాయేం?... ఈనాడుగదా నీకు ఇంత దయ కలగటం మా మీద!...''

అతడికేం పాలుపోలేదు. ఏమిటీ యీవిడ మాట్లాడే పద్ధతి? ఇప్పుడు తనేంచేయాలో, ఏమనాలో నిర్ధరించుకోలేనిస్థితిలో వున్నాడు తను. దానికితోడు ఈమె మాట్లాడే ప్రతిమాటా గుండెల్లో గుచ్చుకుంటోంది .... తనేం చేశాడని? ఇంకా తనని దెప్పిపొడవ దల్చుకుందా?..

"వదినా !!... నువ్వనేదేమిటో నాకు అర్థంకావటంలేదు." అన్నాడు.

"అర్థంకాక పోవటానికి నేనేం అరవంలో మాట్లాట్టంలేదే!— వెళ్ళమంటున్నాను. ఇంకా గట్టిగా చెప్పాలా?" ఏ మాత్రం ఆవేశమూ, ఆర్ద్రతా లేకుండా కర్కశంగా అంది జానకి.

"ఏమిటొదినా అలా మాట్లాడుతున్నావు?... నువ్వు ఎందుకిలా అంటున్నావో నాకర్థం కావటంలేదు ... నేను వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను.ఎందుకో నా మీద కక్ష సాధించ దల్చుకున్నట్టుంది నువ్వు...ఎందుకిలా నన్నుబాధపెడతావు వదినా?... నేనేం అపరాధం చేశానో చెప్పరాదా?..." అన్నాడు సూర్యం అమాయికంగా. అతడి కళ్ళలో నీళ్ళు రాబోతున్నాయి.

జానకి నవ్వుతూ అతడి దగ్గిరికి వచ్చింది. ఆప్యాయంగా అతడి కాలరు సర్దుతూ, ''వెర్రివాడా! నీ మీద కక్ష సాధించదల్చుకున్నా నంటావా?— భలేవాడివి!...లేతకుర్రాడివి, మరీపొద్దుపోతే బజార్లో ఒంటరిగా వెళ్ళలేవని_పదిదాటితే హాస్టలుగేటు మూసేస్తారని— వెళ్ళవయ్యా బాబూ అంటే. ఆ మాత్రం అర్థంచేసుకోలేకపోతే ఎలా? పైగానేమో_అర్థమవటంలేదనీ, నేనేదో బాధపెడుతున్నాననీ నిష్ఠూరమాడతావు!...నా మాటవిని, లే! లేచి, కన్నీళ్ళుతుడుచుకుని బయల్దేరు! ఏరిక్షానో చేయించుకుని త్వరగా రూముకు చేరుకోబాబూ!.. ఈ మాత్రానికే మొహం కందగడ్డలే చేసుకునేవాడివి_మళ్ళీ నన్నంటావు — నేను పిరికిదాన్ననీ, నువ్వేదో పెద్ద శూరుడివనీ_" అంది, అనునయిస్తున్నట్టుగా.

"అయితే వెళ్ళమంటావా, వదినా?"

"వెళ్ళాలి. తప్పదు."

"మరి_అన్నయ్యకు..."

"నేను సంజాయిషీ చెప్పుకుంటాను నీకా భయం అక్కర్లేదు సరేనా?"

సూర్యం మరి మాట్లాడలేదు. తను వచ్చేటప్పుడు వెంట తీసుకొచ్చిన మందులూ సీసాలూ అక్కడే బల్లమీద వుంచి వెళ్ళాడు

అతడు గడప దాటగానే భళ్ళున తలుపు మూసేసింది జానకి వెంటనే చంటివాడి దగ్గరికి వచ్చి చూసింది. వాడు నిద్రపోతున్నాడు బల్లమీద సూర్యం వుంచి వెళ్ళిన మందు సీసాలు బెరుకు బెరుగ్గా తనవంక చూస్తున్నట్లున్నాయ్.

నిద్రపోయే చంటివాడి పక్కనే వచ్చి పడుకుంది జానకి - వాణ్ణి గుండెలకు దగ్గరగా తీసుకుంటూ

సంతోషమో, సంతృప్తో, విజయమో ఏదో తెలియని భావం ఆమె మనస్సు నిండా ఆవరించుకుని వుంది!

అబ్బ! ఇప్పుడెంత తేలికగావుంది మనస్సు! ఇన్నాళ్ళూ మనోకుహరంలో పరస్పరం యుద్ధం చేసుకున్న ఆలోచనలూ, ఆవేశాలూ ఇప్పుడో రాజమార్గం ద్వారా బయటికి ప్రవహించాయి ఆ రాజమార్గం-ఎవరు?

ఎవరోకాదు—సూర్యం! తన మరిది!!

ఇప్పుడు తనలో ఏ అపవిత్రతా లేదు ఎలాంటి చేయకూడని తలంపూ లేదు అసలు తను వూరికే భయపడ్డదిగానీ, తను దారి తప్పలేదు, తప్పుచెయ్యలేదు నల్లనై, భయంకరమైన సరస్సులో వర్షారంభ సూచకమైన సుడిగాలి వొకటి రేగింది ఆ తుఫానూ, ఉరుములూ, మెరుపులూ, సంక్షోభం అన్నీ అయిపోయినాయి. ఇప్పుడు నీరు స్వచ్ఛమై, అడుగునవున్న ఇసుకతోసహా పారదర్శకమై కనబడుతున్నది తాను దివ్యమైన జీవితపాఠం వొకటి నేర్చుకున్నది ఇందులో తనకు గురువులాంటి వాడు — సూర్యం!

పాపం, సూర్యం! వెళ్ళేటప్పుడు ఎంతగా నొచ్చుకున్నాడో పాపం! కాని తనేమీ అసహజంగా ప్రవర్తించలేదనే అనిపిస్తున్నది. కారణం — తను అడది అంతే! అతనివల్ల నేర్చుకున్నపాఠం, పొందిన ఆత్మానుభవం — తనకు తృప్తి కలిగించాయి అది చాలనిపించింది ఆ హద్దు దాటితే తను భరించలేదు! అందుకనే సూర్యాన్ని అంత త్వరగా వెళ్ళిపొమ్మన్నది

తనకీ అనుభవం చాలు!

జానకి చంటివాడి తలపై గెడ్డంతో స్పృశిస్తూ పడుకున్నది.

సుందరం అప్పుడే బస్సుదిగి వచ్చి నట్టున్నాడు - వాకిట్లో తలుపు తడుతున్నాడు. "జానకీ! జానకీ!" అంటూ

---

Printed and Published by A Sudhakar Rao from Yuva Press 5-9-88, Public Garden Road, Hyderabad-1 Controlling Editor Sri "CHAKRAPANI"